సాక్షి సిద్దిపేట

శనివారం । 11 । నవంబర్ । 2023



బాద్‌షా ఎవరో?

హుస్నాబాద్ నియోజకవర్గంలో పోరు ఆసక్తిక రంగా మారింది. హ్యాట్రిక్ కోసం ఒకరు.. గెలుపే లక్ష్యంగా మరో ఇద్దరు పోటీ పడుతున్నారు. త్రిముఖ పోరు నెలకొంది. వివరాలు IIలో ▸



హరీశ్‌రావు పిట్టకథలు నమ్మరు

ఇప్పటికే దుబ్బాక చైతన్యం, పౌరుషం చూపించాం.. అది మరిచి మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతున్నారని దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. వివరాలు IIలో ▸



చదువుతోపాటు..

చదువుతోపాటు క్రీడల్లో ముందుంటే శారీరక, మానసిక దృఢత్వం ఉంటుందని ఇంటర్మీడియెట్ విద్యాశాఖ కమిషనర్, సీనియర్ ఐఏఎస్ నవీన్‌మిట్టల్ అన్నారు. వివరాలు IIలో ▸

న్యూస్‌రీల్

బీఆర్‌ఎస్‌తోనే సుపరిపాలన సాధ్యం

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



చిరువ్యాపారులను ఓటు అభ్యర్థిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్రంలో సుపరిపాలన సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అనంతసాగర్, చర్లఅంకిరెడ్డిపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరోసారి మంత్రి హరీశ్‌రావును ఆశీర్వదించాలన్నారు. సిద్దిపేట అభివృద్ధి దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఏఎంసీ చైర్మన్ వనిత, సొసైటీ చైర్మన్‌లు కనకరాజు, సదానందం గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్ విజయ, ఎంపీటీసీ సరిత పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావుకు ఆర్‌ఎంపీల మద్దతు



ఎంపీపీకి మద్దతు పత్రాన్ని అందిస్తున్న ఆర్‌ఎంపీలు

సిద్దిపేటరూరల్: మంత్రి హరీశ్‌రావుకు రూరల్, నారాయణరావుపేట మండలాల పరిధిలోగల ఆర్‌ఎంపీలు మద్దతు ప్రకటించారు. ఈ మేరకు ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని ఎంపీపీ శ్రీదేవిచందర్‌రావుకు అందించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎంపీ యూనియన్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్, హరీశ్‌రావు చొరవతో గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయన్నారు. హరీశ్‌రావు వెంటే మేము సైతం అని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రమేశ్, తిరుపతి, గ్రామశాఖ అధ్యక్షుడు తిరుపతి, యూనియన్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రవి, శ్రీనివాస్, కార్యదర్శి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగిరం చేయండి

డీఆర్‌డీఓ రవీందర్



పెద్దకోడూరులో రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ

చిన్నకోడూరు(సిద్దిపేట): ధాన్యం కొనుగోళ్లను వేగిరం చేయాలని, తూకం వేసిన వెంటనే తరలించాలని డీఆర్‌డీఓ రవీందర్ నిర్వాహకులను ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దకోడూరు, గోనెపల్లి, రామంచ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. రైతుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. రైతులు ఆరబెట్టిన తర్వాతే ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఏపీఎం మహిపాల్, సీసీలు శ్రీనివాస్ రెడ్డి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలు మాయం

- వెలుగులోకి మరో సైబర్ మోసం
- విద్రోహశక్తులతో సంబంధాలున్నాయంటూ బెదిరింపు
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

పటాన్‌చెరు టౌన్: మరో సైబర్ మోసం వెలుగు చూసింది. సంఘ విద్రోహ శక్తులతో సంబంధాలున్నాయంటూ బెదిరించి ఏకంగా రూ.10లక్షలు కాజేశారు. ఈ సంఘటన అమీన్‌పూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం అమీన్‌పూర్‌కు చెందిన ఓ వ్యక్తికి అక్టోబర్ 6న నీకు సంఘ విద్రోహ శక్తులతో సంబంధాలున్నాయని, లక్నో కస్టమ్స్ కార్యాలయం నుంచి కాల్ చేస్తున్నామని, నీకోసం ఢిల్లీ పోలీసులు వస్తున్నారని బెదిరించారు. ఆ తరువాత అపరిచిత వ్యక్తి బాధితునికి మెసేజ్ రూపంలో ఓ లింకు పంపి దాన్ని క్లిక్ చేసి వచ్చిన ఓటీపీని చెప్పమన్నాడు. దీంతో బాధితుడు అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా లింకు ద్వారా వచ్చిన ఓటీపీని చెప్పగా అతని బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.10 లక్షలు మాయమయ్యాయి. దీంతో బాధితుడు ముందుగా సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



స్వచ్ఛ దీపోత్సవం

సిద్దిపేట మున్సిపాలిటీలో స్వచ్ఛ దీపోత్సవం చేపట్టారు. దీపావళి పండుగ సందర్భంగా శుక్రవారం ముందస్తుగా మెప్మా ఆధ్వర్యంలో పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేశారు. మెప్మా పరిధిలో పనిచేసే మహిళలు, ఆర్పీలు, సీఓలు పెద్ద ఎత్తున దీపాలను వెలిగించారు. స్వచ్ఛ దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, బల్దియా ఆదర్శంగా ఉండాలని కమిషనర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో మెప్మా సీఓ రమ్య, ఆర్పీ మమత తదితరులు పాల్గొన్నారు. - సిద్దిపేటజోన్

అభ్యర్థులు 224 నామినేషన్లు 320

ప్రధాన ఘట్టం పూర్తి

- ముగిసిన నామినేషన్ల స్వీకరణ
- గజ్వేల్ నియోజకవర్గంలో అత్యధికం
- ఈ నెల 13న పరిశీలన
- 15 వరకు ఉపసంహరణ

సాక్షి, సిద్దిపేట: శాసన సభ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ శుక్రవారంతో ముగిసింది. ఈనెల 3న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లాలోని సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాలకు నామినేషన్లు స్వీకరించారు. మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ కేంద్రాలకు వచ్చిన వారిని మాత్రమే లోపలికి అనుమతించారు. టోకెన్లు అందించి స్వీకరించారు. సిద్దిపేట నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి సిద్దిపేట ఆర్‌డీఓ రమేశ్ బాబు, దుబ్బాక ఆర్‌ఓ అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, హుస్నాబాద్ లో ఆర్‌డీఓ బెన్‌షాలం, గజ్వేల్‌లో ఆర్‌డీఓ బన్సీలాల్‌లు స్వీకరించారు.

నాలుగు నియోజకవర్గాల్లో..

జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో 224 మంది అభ్యర్థులు, 320 నామినేషన్ సెట్లను దాఖలు చేశారు. అత్యధికంగా గజ్వేల్ నుంచి రాగా, అత్యల్పంగా దుబ్బాక నియోజకవర్గం నుంచి నామినేషన్‌లు వచ్చాయి.

గజ్వేల్‌లో 154 నామినేషన్లు

బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న గజ్వేల్ నియోజకవర్గం నుంచి అత్యధికంగా నామినేషన్లు వేశారు. అందులో ఎక్కువగా నగరంలోని వట్టినాగులపల్లి గ్రామంలో శంకర్‌హిల్స్ అసోసియేషన్ సభ్యులు ఎక్కువగా నామినేషన్‌లు వేశారు. వీరితో పాటు పలువురు రైతులు సైతం నామినేషన్లు గజ్వేల్‌లోనే వేశారు. దీంతో 127 మంది అభ్యర్థులు 154 నామినేషన్లు దాఖలయ్యాయి.

- 2018లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో హుస్నాబాద్ నుంచి 15 మంది, సిద్దిపేట నుంచి 12 మంది, గజ్వేల్ నుంచి 13 మంది, దుబ్బాక నుంచి 18 మంది పోటీ చేశారు.
- ఈ నెల 13వ తేదీ వరకు నామినేషన్లను పరిశీలించనున్నారు. 15వ తేదీ వరకు విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించారు. అనంతరం అభ్యర్థులకు గుర్తులను కేటాయించనున్నారు. 28వ తేదీ వరకు అభ్యర్థులు ఎన్నికల ప్రచారం నిర్వహించవచ్చు. ఈ నెల 30న పోలింగ్ జరగనుంది.



స్వీకరణకు గడువు ముగియడంతో సిద్దిపేట ఆర్డీఓ కార్యాలయాన్ని మూసివేసిన అధికారులు

నియోజకవర్గం	3తేది	4తేది	6తేది	7తేది	8తేది	9తేది	10తేది	మొత్తం
హుస్నాబాద్	0	01	03	0	09	06	33	52
సిద్దిపేట	0	02	02	05	12	20	35	76
దుబ్బాక	0	03	03	04	05	07	16	38
గజ్వేల్	03	0	01	07	27	48	68	154

బీఫామ్‌లపై..

ప్రధాన పార్టీల నుంచి బరిలో నిలిచేదెవరో ఖరారైంది. ఇతర జిల్లాలో పలు పార్టీలు తొలుత అభ్యర్థులను ప్రకటించినప్పటికీ తర్వాత వారిని కాకుండా ఇతర నాయకులకు బీ ఫామ్‌లు అందించారు. జిల్లాలో సైతం పలు నియోజకవర్గాలకు కాంగ్రెస్, బీజేపీలు అభ్యర్థులను నాయకత్వం మారుస్తారేమోనని పలువురు ఆందోళన చెందారు.

కేసీఆర్ తరఫున రెండో సెట్టు దాఖలు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం బొబ్బాయిపల్లికి చెందిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ శుక్రవారం బీఆర్‌ఎస్ గజ్వేల్ అభ్యర్థి, సీఎం కేసీఆర్ తరఫున రెండో నామినేషన్ సెట్టును అందించారు. గజ్వేల్ ఆర్డీఓ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఈకార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల పోరే అస్త్రం.. బాధితుల మంత్రం

గజ్వేల్: రాష్ట్ర రాజకీయాలకు కేంద్రబిందువుగా మారిన గజ్వేల్ ఎన్నికల నేపథ్యంలోనూ వార్తల్లో కెక్కుతోంది. సీఎం కేసీఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్న ఈ అసెంబ్లీ స్థానంలో నామినేషన్లు వేయటం ద్వారా తమ సమస్యలపై నిరసన తెలియజేయడానికి బాధితులు ప్రయత్నిస్తున్నారు. మరికొందరు సంచలనాల కోసం ఆరాటపడుతున్నారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలోని శంకర్‌హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బాధితుల అంశం నామినేషన్ల సందర్భంగా తెరపైకి వచ్చింది. వారి కథనం ప్రకారం.. 1983లో 400 ఎకరాల భూమిని రైతుల వద్ద కొనుగోలు చేసి 3300 ప్లాట్లుగా అభివృద్ధి చేసుకున్నారు. వీటికి సంబంధించి రిజిస్ట్రేషన్లు సైతం పక్కాగా ఉన్నాయి. 111 జీవో వల్ల ఆ ప్లాట్లలో నిర్మాణాలు చేపట్టలేక పొజిషన్‌లో ఉన్నారు. కానీ ధరణి వచ్చిన తర్వాత ఆ ప్లాట్లను వ్యవసాయ భూమిగా రికార్డుల్లో మార్చి బడాబాబులు కాజేయాలని బాధితుల ఆరోపణ. ప్రస్తుతం ఆ భూములోకి బాధితులు రానివ్వడం లేదని, ఈ సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా పరిష్కరించడంలేదని తెలిపారు. చివరకు గజ్వేల్‌లో నామినేషన్లు వేయడం ద్వారా తమ నిరసనను తెలియజేయడానికి నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే ఈనెల 9న 25మంది, శుక్రవారం మరో 30మందికిపైగా నామినేషన్లు వేశారు. వీరే కాదు మల్లన్నసాగర్ నిర్వాసితులు సైతం నామినేషన్లు వేశారు. తమిళనాడులోని సాలెం జిల్లా మెట్టూర్‌దామ్ తాలూకాకు చెందిన కే. పద్మరాజన్ గజ్వేల్‌లో ఈనెల 3న నామినేషన్ వేశారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో 236 నామినేషన్లు వేసినట్లు చెప్పారు.

సర్క్యులర్ రద్దు చేయాల్సిందే

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగుల సర్వీస్ రూల్స్‌కు వ్యతిరేకంగా ఇచ్చిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దకోడూరులో ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో క్షేత్రస్థాయిలో పని చేస్తున్న సిబ్బందికి పదోన్నతులు కల్పించాలన్నారు. మీటర్ రీడర్స్‌ను ఆర్టిజన్‌గా గుర్తించాలన్నారు. సమావేశంలో సంఘ నాయకులు రామ్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకట్, రాజు, లింగం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాస్కర్

కొడుకును కాపాడి.. తాను ప్రాణాలొదిలి..

- నీటిలో తండ్రి మునక
- కోహెడ మండలంలో ఘటన
- పండుగ వేళ విషాదం

కోహెడరూరల్ (హుస్నాబాద్): కొడుకును కాపాడుకునే క్రమంలో ఓ తండ్రి నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన మండల పరిధిలోని సింగరాయ ప్రాజెక్టు సమీపంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నంగునూరు మండల కేంద్రానికి చెందిన యాదగిరి గౌడ్(45) గురువారం తన కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి పండుగ సందర్భంగా నదీ స్నానాల కోసం కోహెడ మండలంలోని సింగరాయ్య ప్రాజెక్టు లొద్దులోకి వెళ్లారు. అందరూ కలిసి స్నానం చేస్తుండగా యాదగిరి కుమారుడు నీటిలో మునుగుతుండటం చూసి తనకు ఈత రాపోయినా ఒక్కసారిగా గుంతలోకి దూకాడు. కుమారుని కాపాడి తాను నీటిలో మునిగిపోయాడు. భర్త మునిగిపోవడం చూసిన భార్య సైతం నీటిలో దూకింది. తల్లి నీటిలో మునిగిపోతుండటంతో పక్కనే ఉన్న కుమార్తె చీరను అందివ్వగా బయటకు వచ్చింది. కానీ భర్తను కాపాడుకోలేకపోయింది. అప్పటి వరకు సంతోషంగా ఉన్న కుటుంబం ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగిపోయింది. ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.



యాదగిరి (ఫైల్)

కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలే..

- ప్రజలపై ప్రేమ తక్కువ..
- అధికారంపై ధ్యాస ఎక్కువ
- మంత్రి హరీశ్‌రావు
- బీఆర్‌ఎస్‌లో చేరికలు



కాంగ్రెస్ నాయకులను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రజలపై ప్రేమ కంటే అధికారంపై ధ్యాస ఎక్కువ అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ బ్లాక్ ప్రెసిడెంట్ ముఖీనం శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, ఎన్‌ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడు శ్రావణ్ తదితరులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు అబద్ధాలతో, కుట్రలు చేస్తోందని విమర్శించారు. చంటి పిల్ల తల్లి చేతుల్లో ఎంత క్షేమంగా ఉంటుందో, కేసీఆర్ చేతుల్లో తెలంగాణ అంత సురక్షితంగా ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో పది నియోజకవర్గాల్లోనూ బీఆర్‌ఎస్ గెలుస్తుందన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలు తప్పవన్నారు. వ్యవసాయానికి ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. రైతులకు అండగా ఉండాలని రైతు బంధును ముఖ్యమంత్రి కేసీఆర్ సృష్టించారన్నారు. గతంలో కరువుతో ఉన్నామని, నేడు సస్యశ్యామలం గా మార్చుకున్నామన్నారు. మళ్లీ కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే పదేళ్ళు వెనక్కి వెళ్లాల్సివస్తుందన్నారు. వేసవిలో కూడా చెరువులు, చెక్ డ్యామ్‌లు, వాగులు వంకలు జల కళతో విరాజిల్లుతున్నాయన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గూటికి కాంగ్రెస్ నాయకులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం మంగోల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ మాజీ ఎంపీటీసీ, తొగుట, కొండపాక, దౌల్తాబాద్ మండలాల బ్లాక్ అధ్యక్షుడు ముష్టం శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. హరీష్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు ఆకర్శితులై కాంగ్రెస్, బీజేపీల నుంచి ముఖ్య నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. పని చేసే వారికి సరైన గుర్తింపు నివ్వడం బీఆర్‌ఎస్‌కే సాధ్యమన్నారు. బందారం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీల నుంచి యువతను మంత్రి హరీశ్‌రావు బీఆర్‌ఎస్ కండువా కప్పి ఆహ్వానించారు.



కాంగ్రెస్ నాయకులను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సైన్స్‌ఫెయిర్‌తో సృజనాత్మకత

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటజోన్: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు సైన్స్ ఫెయిర్ ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక టీటీసీ భవన్ లో 31వ జాతీయ బాలల సైన్స్ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల మేధావుల తయారీకి దోహదపడుతుందన్నారు. సమావేశంలో వివిధ పాఠశాలల నుంచి 85 ప్రాజెక్టులు రూపొందించారు. జిల్లాలోని ప్రభుత్వ జెడ్పీ, మోడల్ స్కూల్స్, కేజీబీవీలు, ప్రయివేటు స్కూల్స్ విద్యార్థులు ప్రాజెక్టులు రూపకల్పన చేశారు. వీటిలో నుంచి రాష్ట్ర స్థాయి కోసం ఆరు ప్రాజెక్టులు ఎంపిక చేశారు. ఎంపిక అయిన విద్యార్థులు.. అశ్వంత్ (దామర కుంట), సజన్ రెడ్డి(శనిగరం), సూపియన్ (సిద్దిపేట), సాయి వర్షిత్(సిద్దిపేట), గీతిక (బేగంపేట), రేఖ (చేర్యాల) విద్యార్థులు ఉన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచుదాం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రాథమిక విద్య ప్రమాణాలను పెంచుదామని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి వలంటీర్లకు సూచించారు. విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించడానికి రూపొందించిన 'పిల్లల కోసం' సంబంధించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ వాకాటి కరుణ ఆదేశాల మేరకు ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వలంటీర్లు విద్యార్థుల నైపుణ్య ప్రమాణాలను పెంచేందుకు దోహదపడే అంశాలను పరిశీలించాలన్నారు.



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పకడ్బందీగా నిబంధనల అమలు

- ఎన్నికల పోలీసు అబ్జర్వర్ సోనమ్ టెన్సింగ్ భూటియా
- సీపీ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్ష

సిద్దిపేటకమాన్: ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని అబ్జర్వర్ సోనమ్ టెన్సింగ్ భూటియా పోలీసు అధికారులకు సూచించారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ శ్వేత, సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ పోలీసు అధికారులతో భూటియా శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకునే విధంగా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. చెక్ పోస్టులలో వాహనాల తనిఖీ ముమ్మరం చేయాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలని సూచించారు. డబ్బు, మద్యం రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా సీపీ శ్వేత మాట్లాడుతూ జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టామని సీపీ శ్వేత భూటియాకు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బార్డర్ పీఎస్ పరిధిలలో 12 స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేసి జియో ట్యాగింగ్ చేశామన్నారు. అంతకుముందు పొన్నాల గ్రామ శివారులో ఉన్న ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంను, సీసీ కెమరాల పనితీరును భూటియా పరిశీలించారు. సమావేశంలో నియోజకవర్గాల పోలీసు అధికారులు, ఏసీపీలు సరేందర్‌రెడ్డి, రమేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లోని స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న భూటియా

అప్రమత్తంగా ఉండాలి

గజ్వేల్‌రూరల్: ఎన్నికల వేళ పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అబ్జర్వర్ భూటియా సూచించారు. శుక్రవారం ఐవోసీలోగల స్ట్రాంగ్ రూమ్, ఆర్‌వో ఆఫీస్, చెక్‌పోస్టులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐవోసీలోని స్ట్రాంగ్ రూమ్, మహతి విద్యాలయం వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలన్నారు. చెక్‌పోస్టులో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పంపించాలన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మీడియా సెంటర్ పరిశీలన

సిద్దిపేటరూరల్: హుస్నాబాద్–సిద్దిపేట నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్ జయశ్రీ ఎస్.భోజ్ (ఐఎఎస్) కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తో కలిసి కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను పరిశీలించారు. ఆయా విభాగాల ద్వారా జరుగుతున్న ఎన్నికల విధులను గూర్చి కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ఎన్నికల జనరల్ అబ్జర్వర్ మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ఎన్నికల ప్రక్రియ జరగాలన్నారు. అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

క్లుప్తంగా

పొన్నం ఓటమి ఖాయం

హుస్నాబాద్: కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ కరీంనగర్ నుంచి మూడుసార్లు పోటీ చేస్తే అక్కడి ప్రజలు ఓడిస్తే ఇక్కడికి వచ్చాడని నాలుగోసారి కూడా ఓడిపోవడం ఖాయమని బీఆర్ఎస్ అభ్యర్థి సతీష్‌కుమార్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని 8, 9, 18, 19వ వార్డుల్లో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ కరీంనగర్‌లో చెల్లని రూపాయి ఇక్కడ ఎలా చెల్లుతుందన్నారు. వేల కోట్ల రూపాయలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని, మళ్లీ నన్ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాష, తదితరులు పాల్గొన్నారు.

కుంటుపడిన అభివృద్ధి

హుస్నాబాద్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ వైఫల్యాలపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం చార్జిషీట్ విడుదల చేస్తున్నట్లు హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ అన్నారు. పార్టీ కార్యాలయంలో ఏడు మండలాల పార్టీ అధ్యక్షులతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే సతీష్‌కుమార్ వైఫల్యాలపై చార్జిషీట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. హుస్నాబాద్‌ను సెంటిమెంట్‌గా తీసుకొని ఇక్కడ సీఎం కేసీఆర్ సభ నిర్వహించారని, డెవలప్‌మెంట్ మాత్రం సిద్దిపేట, గజ్వేల్‌కు పరిమితమైందన్నారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, ఏడు మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటు వేస్తే అమ్ముడుపోతారు

హుస్నాబాద్: కాంగ్రెస్‌కి ఓటు వేస్తే గెలిచిన తర్వాత అభ్యర్థులు అమ్ముడుపోతారని హుస్నాబాద్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొమ్మ శ్రీరాంచక్రవర్తి అన్నారు. చివరి రోజు నామినేషన్ ప్రక్రియలో భాగంగా పట్టణంలో పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీరాంచక్రవర్తి మాట్లాడుతూ.. మా తండ్రి బొమ్మ వెంకటేశ్వర్లు ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. 20 ఏళ్లు మా తండ్రి, 20 ఏళ్లు తాను నియోజకవర్గ సమస్యలపై పోరాడిన చరిత్రఅని అన్నారు. బీజేపీకి ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి, కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, నియోజకవర్గ నాయకురాలు మంజుల రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు భారీ మెజార్టీ ఖాయం : వంటేరు

జగదేవ్‌పూర్(గజ్వేల్): గజ్వేల్ అసెంబ్లీ అభ్యర్థిగా మూడోసారి పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పీర్లపల్లి, ధర్మారం, కొత్తపేట, ఇటిక్యాల, లింగారెడ్డిపల్లి, బీజీ వెంకటాపూర్, తీగుల్, రాంనగర్ తదితర గ్రామాల్లో జగదేవ్‌పూర్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి రాధాకృష్ణశర్మతో కలిసి శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో మహిళలు బతుకమ్మలు, బోనాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి, ఎంపీపీ బాలేశంగౌడ్, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఆత్మ చైర్మన్ రంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నరేశ్, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, కొండపోచమ్మ దేవాలయ పాలక మండలి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు చంద్రశేఖర్, యాదవరెడ్డి, వెంకట్రాంరెడ్డి, మహిళా మండల అధ్యక్షురాలు, ఎంపీటీసీ కవిత, కావ్యదుర్గయ్య, కోఆప్షన్ సభ్యులు ఇక్బాల్, నాయకులు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాద్‌షా ఎవరో?



ఒడితెల సతీష్‌కుమార్, బీఆర్ఎస్ అభ్యర్థి



పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ అభ్యర్థి



బొమ్మ శ్రీరాంచక్రవర్తి, బీజేపీ అభ్యర్థి



హుస్నాబాద్ పట్టణం వ్యూ

- ఉద్యమగడ్డపై ఆసక్తికర పోరు
- హ్యాట్రిక్ కోసం ఒకరు..
- మొదటిసారిగా గెలుపే లక్ష్యంగా మరో ఇద్దరు
- ప్రధాన పార్టీల మధ్య త్రిముఖ పోరు

హుస్నాబాద్: తెలంగాణ ఉద్యమ సమయంలో వెన్నుదన్నుగా సహాయ సహకారాలు అందించి, కేసీఆర్‌కు అత్యంత సన్నిహితంగా ఉన్న ఒడితెల కుటుంబం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి సతీష్‌కుమార్ మూడోసారి ముచ్చటగా ఎమ్మెల్యేగా విజయం సాధించాలని శ్రమిస్తున్నారు. ఎలాగైనా ఈసారి గెలిచి అసెంబ్లీలో తన గళం విప్పాలని కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ పట్టుదలతో ముందుకెళ్తున్నారు. అలాగే, మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకటేశ్వర్లు వారసుడిగా మొదటిసారి ఎమ్మెల్యేగా బోణీ కొట్టి తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకోవాలని బీజేపీ అభ్యర్థి బొమ్మ శ్రీరాంచక్రవర్తి ఉవ్విళ్లూరుతున్నారు. దీంతో హుస్నాబాద్‌లో ప్రధాన పార్టీల త్రిముఖ పోరుతో రాజకీయం రసవత్తంగా మారింది.

ఇందుర్తి నుంచి మొదలుకొని పునర్విభజనలో హుస్నాబాద్‌గా మారిన నియోజకవర్గంలోని ఓటర్లు ప్రతీ ఎన్నికల్లో విలక్షణమైన తీర్పు ఇస్తున్నారు. రెండుసార్లు పీడీఎఫ్, ఆరు సార్లు సీపీఐ, మూడు సార్లు కాంగ్రెస్ విజయం సాధించాయి. తెలంగాణ సాధన అనంతరం బీఆర్ఎస్(టీఆర్ఎస్) వరుసగా విజయాన్ని దక్కించుకున్నాయి.ఈసారి ఎన్నికల్లో పోటీ రసవత్తరంగా మారడంతో ఎవరు గెలుస్తారో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే గెలిపిస్తాయి

ఒడితెల సతీష్‌కుమార్ 2014, 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2023లో మూడోసారి ఎమ్మెల్యేగా గెలవాలని నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేస్తున్నారు. సీఎం కేసీఆర్‌కు సెంట్‌మెంట్‌గా హుస్నాబాద్ నుంచే ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభతో గులాబీ శ్రేణుల్లో జోష్ నింపింది. అదే జోష్‌ను కొనసాగిస్తూ ఇప్పటికే సగం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని ధీమాతో ప్రచారాన్ని ఉధృతం చేశారు. పదేళ్లకాలంలో తాను చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని వివరిస్తూ ప్రజల్లోకి వెళ్తున్నారు. 2018లో సతీష్‌కుమార్ దాదాపు 73 వేలకు పైచిలుకు మెజార్టీతో గెలుపొందారు. ఈసారి లక్ష మెజార్టీ సాధించాలనే లక్ష్యంతో వ్యూహాలకు పదును పెడుతూ ముందుకు నడుస్తున్నారు.

ఉద్యమకారుడిగా ప్రజల్లోకి...

హుస్నాబాద్ నుంచి మొదటిసారిగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యేగా గెలుపొందాలని గట్టి పట్టుదలతో ఉన్నారు. కరీంనగర్ ఎంపీగా పని చేసిన అనుభవం, రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన నాయకుడిగా ప్రజల్లోకి వెళ్తున్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించే విధంగా తెలంగాణ బిడ్డగా తన గళాన్ని వినిపించి పేపర్ స్ప్రేకు గురై తెలంగాణ ఉద్యమ నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను పక్కాగా అమలు చేస్తామని ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు. అలాగే కాంగ్రెస్, సీపీఐ పొత్తుతో హుస్నాబాద్ సీటును కాంగ్రెస్‌కు కేటాయించిన విషయం విధితమే. సీపీఐ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డితో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాడు. టికెట్ ఆశించి అలకబూనిన అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డిని అధిష్టానంతో మాట్లాడించి మచ్చిక చేసుకున్న పొన్నం ప్రభాకర్ ఎలాగైనా ఈసారి గెలవాలని పట్టుదలతో ఉన్నారు.

మోదీ పథకాలే గట్టెక్కిస్తాయి

హుస్నాబాద్ బీజేపీ అభ్యర్థి బొమ్మ శ్రీరాంచక్రవర్తి మొదటిసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగారు. శ్రీరాంచక్రవర్తి తండ్రి బొమ్మ వెంకటేశ్వర్లు 1999లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. బొమ్మ వెంకటేశ్వర్లు వారసుడిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. తన తండ్రి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి, అయనకు ఉన్న పరిచయాలు తనకు కలిసి వస్తాయని ముందుకు సాగుతున్నారు. తండ్రి తర్వాత కాంగ్రెస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రజల్లో ఉంటూ సమస్యలపై పోరాటాలు చేశారు. కాంగ్రెస్‌ని అంటిపెట్టుకొని పార్టీ బలోపేతం కోసం కృషి చేశారు. తదనంతరం జరిగిన పరిణామాలతో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ప్రోద్బలంతో శ్రీరాంచక్రవర్తి బీజేపీలో చేరారు. పార్టీ టికెట్ రావడంతో ప్రచారం ముమ్మరంగా చేస్తున్నారు. ప్రధాని మోదీ పథకాలు, అభివృద్ధి పనులను జనంలోకి తీసుకెళ్తూ ప్రచారం చేస్తున్నారు.

జంగ్ తెలంగాణ

ఖేడ్ కాంగ్రెస్‌లో కుదిరిన సయోధ్య

- టికెట్ త్యాగం చేసిన సురేశ్ షెట్కార్
- అభ్యర్థిగా పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నారాయణఖేడ్ కాంగ్రెస్ అభ్యర్థికి సంబంధించి శుక్రవారం ఊహించని విధంగా అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. పార్టీ టికెట్ కోసం మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సురేశ్ షెట్కార్, మరో ఉపాధ్యక్షుడు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పోటీపడ్డారు. అధిష్టానం సురేశ్ షెట్కార్‌ను అభ్యర్థిగా ప్రకటించి బీ–ఫామ్ సైతం అందజేసింది. వారం రోజులుగా ఇద్దరి మధ్య సయోధ్యకు కాంగ్రెస్ పెద్దలు యత్నించినా ఫలించలేదు. దీంతో కాంగ్రెస్ తరఫున సురేశ్ షెట్కార్, స్వతంత్ర అభ్యర్థిగా సంజీవరెడ్డి శుక్రవారం నామినేషన్ వేయడానికి నిర్ణయించుకొని అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ మేరకు నియోజకవర్గంలోని తమ తమ కార్యకర్తలను ఖేడ్‌కు పిలిపించుకున్నారు. ఉదయం సురేశ్ షెట్కార్, సంజీవరెడ్డిలతోపాటు వారి కుటుంసభ్యులు పంచగామకు వెళ్లి చర్చించుకున్నారు. పదేళ్లుగా తమ మధ్య వర్గవిభేదాల కారణంగా కార్యకర్తలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని, అందుకే కలిసికట్టుగా ఉండి బీఆర్ఎస్ దౌర్జన్యాలను ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని నిర్ణయించుకున్నారు. తాను ఇదివరకు జహీరాబాద్ ఎంపీగా పని చేసినందున వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఎంపీగా పోటీ చేస్తానని, తనకు వచ్చిన టికెట్‌ను సంజీవరెడ్డికి ఇస్తున్నట్లు షెట్కార్ అధిష్టానవర్గానికి వివరించారు. దీంతో అధిష్టానం ఆగమేఘాలమీద సంజీవరెడ్డి పేరిట బీ–ఫామ్‌ను పంపింది. సురేశ్ షెట్కార్, సంజీవరెడ్డిలు తమ తమ సోదరులతో కలిసి వెళ్లి సంజీవరెడ్డి నామినేషన్‌ను దాఖలు చేశారు.

టికెట్లు అమ్ముకున్న కాంగ్రెస్

- అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అమ్ముతుంది
- అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్
- భారీ ర్యాలీతో నామినేషన్ దాఖలు



గజమాలతో చంటి క్రాంతికిరణ్

జోగిపేట (అందోల్): టిక్కెట్లు అమ్ముకున్న కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రాన్నే అమ్ముకుంటుందని అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ విమర్శించారు. అందోల్ నియోజకవర్గ శాసన సభ స్థానానికి బీఆర్ఎస్ పార్టీ తరఫున చంటి క్రాంతి కిరణ్ నామినేషన్ దాఖలు చేశారు. చాముండేశ్వరి దేవాలయంలో నామినేషన్ పత్రాలకు సతీమణి పద్మావతితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జోగిపేట పార్టీ కార్యాలయం నుంచి ప్రత్యేక చైతన్య రతంలో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవి వ్యామోహంతో ఉన్న దామోదర్‌కు ఓటమి భయం పట్టుకుందని ఆరోపించారు. ఎలాగైనా గెలవాలని దామోదర్ సర్పంచ్‌కు రూ.5 లక్షలు, జెడ్పీటీసీకి రూ.20 లక్షలు, కౌన్సిలర్‌కి రూ.25 లక్షలు ఇస్తానని ఆశ చూపుతున్నాడని మండిపడ్డా రు. దామోదర్ కు చిత్తశుద్ది ఉంటే అవే రూ.200 కోట్లు అందోల్ నియోజకవర్గ అభివృద్ధికి ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ హ్యాట్రిక్‌సాధిస్తుందని, ఎన్నికల ప్రచారానికి అన్ని వర్గాల నుంచి అపూర్వ స్పందన వస్తుందన్నారు. ర్యాలీలో కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతికిరణ్, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి డాన్సులు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచాయి. కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట నాయకులు రాహుల్ కిరణ్, జైపాల్‌రెడ్డి, కాశీనాథ్, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె సంజీవయ్య, జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర నాయకులు మారుతీసాగర్ పాల్గొన్నారు.

రాజన్న.. చక్రం తిప్పన్న



కుమ్మరి సారెపై కుండ చేస్తున్న రాజనర్సు

సిద్దిపేట బీఆర్ఎస్ అభ్యర్థి హరీశ్‌రావును భారీ మెజార్టీతో గెలిపించుకుందామని సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు అన్నారు. శుక్రవారం పట్టణంలోని 35, 36వ వార్డుతోపాటు పలు వార్డుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే, రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుమ్మరి సారెపై కుండలు చేస్తూ, లాండ్రీ షాపు వద్ద ఇస్త్రీ చేస్తూ హరీశ్‌రావుకు మద్దతుగా కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

–సిద్దిపేటకమాన్

అక్కా.. ఓటు కారుకే



బీడీలు చుడుతున్న నాయకులు

మండల పరిధిలోని కమలాయపల్లిలో జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం బీఆర్ఎస్ గ్రామ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ ఇంటి ఎదుట బీడీలు చుడుతున్న మహిళల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే రూ.2 వేలు ఉన్న పెన్షన్ రూ.5వేలు అవుతుందని చెప్పారు. –చేర్యాల(సిద్దిపేట)

బీఆర్ఎస్‌లోకి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

మంత్రి కేటీఆర్ సమక్షంలో చేరిన జనార్దన్‌రెడ్డి



మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జనార్దన్‌రెడ్డి, పక్కన దేవేందర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నందు జనార్దన్‌రెడ్డి తన అనుచరులతో కలిసి శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ జనార్దన్‌రెడ్డికి కండువా కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. మెదక్ పార్టీ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి గెలుపుకోసం సమష్టిగా కృషి చేయాలని మంత్రి కేటీఆర్ ఆయనకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట నాయకుడు, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, కల్వకుంట సహకార సంఘం అధ్యక్షుడు అందె కొండల్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పాడెండ్ల లక్ష్మణ్ యాదవ్, వెంకట్‌రెడ్డి, రమేశ్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు పిట్టకథలు నమ్మరు



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

- ఆశీర్వదిస్తే అన్నిరంగాల్లో అభివృద్ధి
- దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: సిద్దిపేట పెత్తనం మనకెందుకు.. ఇప్పటికే దుబ్బాక చైతన్యం, పౌరుషం చూపించాం అదిమరిచి మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతున్నాడని దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం అక్బర్‌పేట- భూంపల్లి మండలంలోని పోతారెడ్డిపేట, చిన్ననిజాంపేట, రామేశ్వరంపల్లి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. మంత్రి హరీశ్‌రావు దుబ్బాకలో ఎన్ని పిట్ట కథలు చెప్పినా ప్రజలు నమ్మరని అన్నారు. ఉపఎన్నికలో కర్రు కాల్చి వాతపెట్టారని గుర్తు చేశారు. దుబ్బాకపై ప్రభుత్వానికి మొదటి నుంచి సవతిపల్లి ప్రేమే అని విమర్శించారు. మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే అండగా ఉంటానని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎన్ని ప్రలోభాలు పెట్టినా, మాయమాటలు చెప్పినా నమ్మవద్దన్నారు.

భారీగా చేరికలు

దుబ్బాక మండలం బల్వంతాపూర్ సర్పంచ్ భర్త కిష్టయ్యతో పాటు ఉపసర్పంచ్ దండుగుల యాదగిరి, వార్డు సభ్యులు అలాగే రఘోత్తంపల్లి ఉపసర్పంచ్ కంపె కవిత పర్శరాములు, పద్మశాలిగడ్డకు చెందిన 30 మంది బీఆర్ఎస్ నాయకులు రఘునందన్ రావు సమక్షంలో బీజేపీలో చేరారు.

దుబ్బాక గడ్డపై మరోసారి..

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక గడ్డపై మరోసారి బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు ధీమా వ్యక్తం చేశారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని కూడవెల్లిలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపసర్పంచ్ చెరుకు యాదగిరితో పాటు పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీలో దుబ్బాక సమస్యలపై గొంతు విప్పి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లన్నగారి భిక్షపతి, కృష్ణ, స్వరూప, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటా..

చేగుంట(తూప్రాన్): ఆదరించి గెలిపిస్తే అన్ని గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మండలంలోని చిన్నశివునూర్, మక్కరాజీపేట గ్రామాల్లో శుక్రవారం రాత్రి రఘునందన్ రావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దుబ్బాక ఎమ్మెల్యేగా గెలిచిన రెండున్నరేళ్లు ప్రజల మధ్యనే ఉండి వారి సమస్యలను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు భూపాల్, మాజీ ఎంపీపీ పాండు, వైస్ ఎంపీపీ రాంచంద్రం, గణేశ్ రవికుమార్, నాయకులు వెంగళ్‌రావు, సంతోష్‌రెడ్డి, గోవింద్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలోనే కార్యకర్తలకు గుర్తింపు



రఘునందన్ రావుతో కలిసి నామినేషన్ వేస్తున్న శ్రీకాంత్ రెడ్డి

సిద్దిపేటజోన్: బీజేపీలోనే కార్యకర్తలకు మంచి గుర్తింపు ఉంటుందని, అవసరమైతే పోటీ చేసేందుకు టికెట్టు వస్తుందని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట బీజేపీ అభ్యర్థి శ్రీకాంత్ రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్‌లో వారసత్వ రాజకీయాలు ఉంటాయని, అక్కడ వంద ఏళ్లు అయినా కార్యకర్తలకు టికెట్టు రాదని ఆరోపించారు. తండ్రి పోతే కొడుకు, కొడుకు పోతే మనువడు వస్తారని విమర్శించారు. అభ్యర్థి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ... సిద్దిపేటలో డబ్బులున్న వారికి, పేదవానికి మధ్య పోటీ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ వెంకట్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు రామచందర్ రావు, విద్యాసాగర్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- భూ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్
- రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న నవీన్ మిట్టల్, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటఎడ్యుకేషన్: క్రీడలు విద్యార్థుల జీవితాల్లో అంతర్భాగం కావాలని, చదువుతోపాటు క్రీడల్లో ముందుంటే శారీరక, మానసిక దృఢత్వం ఉంటుందని ఇంటర్మీడియట్ విద్యాశాఖ కమినర్, భూపరిపాలన, స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ నవీన్‌మిట్టల్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాలలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ అండర్ –19 (ఎస్‌జీఎఫ్) జూనియర్ కళాశాలల ఫెడరేషన్ క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చాలని, గెలిచిన వారిని చూసి అసూయ పడకుండా వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ మాట్లాడుతూ క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు అందిస్తున్నామని చెప్పారు. వాటిని సద్వినియోగం చేసుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. జిల్లాలోని స్విమ్మింగ్ పూల్‌ను వినియోగించుకొని మెళకువలు నేర్చుకోవాలన్నారు. తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్(టీజీఎల్ఏ)రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం మాట్లాడుతూ.. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నుంచి అండర్ –19 క్రీడలను ఇంటర్ విద్యార్థులతో నిర్వహించిన ఘనత సిద్దిపేటకే దక్కిందన్నారు. అలాగే, జిల్లా ఇంటర్ విద్యాధికారి, అండర్ –19 క్రీడల చైర్మన్ సూర్యప్రకాశ్, కార్యదర్శి సమ్మయ్య, డీవైఎస్ఓ నాగేందర్, ప్రిన్సిపల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కూచంగారి శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ సత్యనారాయణరెడ్డి, శారద, సురేష్‌రెడ్డి, భూపాల్‌రాజు, బుచ్చిరెడ్డి, రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ రెఫరీ బోర్డు కన్వీనర్ రవీందర్‌రెడ్డి, క్రీడా పోటీల ఇన్‌చార్జి వెంకటేశ్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లీ దీవించమ్మా..



పూజలు చేస్తున్న సునీతారెడ్డి



పూజలు చేస్తున్న రోజాశర్మ

శివ్వంపేట(నర్సాపూర్): బీఆర్ఎస్ నర్సాపూర్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి శుక్రవారం మండల పరిధి దొంతి వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. నామినేషన్ వేసే ముందు ఆలయంలో పూజలు చేయడం ఆమెకు ఆనవాయితీ. కుటుంబ సభ్యులతో పూజలనంతరం నామినేషన్ వేసేందుకు వెళ్లారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): సిద్దిపేట బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి హరీశ్‌రావు భారీ మెజార్టీతో విజయం సాధించాలని శుక్రవారం మండల పరిధిలోని అనంతసాగర్ సరస్వతీ క్షేత్రంలో జెడ్పీచైర్‌పర్సన్ రోజాశర్మ పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.